అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



దేవరుప్పుల: గులాబీ జెండాలే పాటకు స్టెప్పు వేస్తున్న ఎర్రబెల్లి



పాలకుర్తి: మాట్లాడుతున్న దయాకర్‌రావు

- జీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఆరు దశాబ్దాల్లో జరుగని అభివృద్ధిని కేసీఆర్ సారథ్యంలో పదేళ్లలో నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేశానని, నిండు మనసుతో ప్రజలు ఆశీర్వదించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని నల్లకుంట, చిప్పరాళ్లబండ, పడమటితండా, కోలుకొండ, అప్పిరెడిపల్లె, చిన్నమడూరు, బంజరలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శనలతో ఘనస్వాగతం పలుకగా ఇంటింటా ప్రచారం చేసి మాట్లాడారు. తాగు, సాగునీటి కల్పన, విద్య, ఆరోగ్య విభాగాలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 90 శాతం పనులు పూర్తి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే మిగిలిన పదిశాతం పనులు పూర్తిచేసి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన ధ్యేయంగా పనిచేస్తామన్నారు. తాను పాలకుర్తిలో ఎమ్మెల్యేగా కొనసాగిన తరుణంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో గత పాలకులతో బేరీజు వేసుకొని ప్రజల భవిష్యత్ నిర్దేశించే ఈ ఎన్నికలపై ప్రజలు ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలకు బోల్తాపడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. పలు గ్రామాల్లో పలు పార్టీల నుంచి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రేలారే గంగవ్వ, కనకమ్మలతో గులాబీ జెండాలే పాటకు నృత్యం చేస్తూ ప్రజల్ని మమేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎన్నారై ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, మండల సమన్వయకర్తలు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, పార్టీ అధ్యక్షుడు సంతోష్,బాలు, ఠాణ్‌సింగ్, ఎల్లేష్, యాకయ్య, ఎల్లయ్య, ప్రజాప్రతిని. దులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబెల్లి ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఉపాధి కల్పించే బాధ్యత నాదే..

పాలకుర్తి: నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే బాధ్యత తీసుకున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశంలో గురువారం దయాకర్‌రావు మాట్లాడారు. ఒక వైపు ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూనే, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని ఉద్యోగాలు కల్పించామని అన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని అన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదేవి మాట్లాడుతూ తమకు వచ్చిన ఈ అవకాశంతో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గం నుంచి సుమారు 2 వేల మంది పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

పెద్దవంగర: కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ఓటేసి మోసపోవద్దని పాలకుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన టీడీపీ పెద్దవంగర మండల అధ్యక్షుడు బైన భిక్షపతి గురువారం మంత్రి దయాకర్‌రావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని, పాలకుర్తిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకి పాలకుర్తి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుంపల సమ్మయ్య, బొమ్మెరబోయిన రాజు, వేణు సాగర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి: బీఆర్ఎస్‌లో చేరిన పెర్కవేడు వడ్డెర కులస్తులతో మంత్రి దయాకర్‌రావు

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన వడ్డెర కులస్తులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. సుమారు 15 మంది వడ్డెర కులస్తులు వల్లెపు మహేందర్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో చేరగా వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల తారశ్రీరాజబాబు, ఎంపీటీసీ బండి అనూషరాజబాబు, గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్నెపు వెంకన్న, అన్నెపు ప్రభాకర్, నాకబోయిన సుధాకర్, బాషబోయిన అశోక్‌లు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి బీఆర్ఎస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, ఉప సర్పంచ్ గుడి యుగేంధర్‌రెడ్డి, మైబురెడ్డి, యాదగిరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మండల స్థాయి ఉపన్యాస పోటీలను గురువారం నిర్వహించారు. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ హైదరాబాద్, రాష్ట్ర విద్యాశాఖ, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రతిభా పోటీలు దోహదపడుతాయన్నారు. పాఠశాలలో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటాలని అన్నారు.



ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మతిభ్రమించి మాట్లాడుతున్న రేవంత్, ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్: సభాస్థలి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కడియం



జఫర్‌గఢ్: షాపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు

- నక్సలైట్లను ఎన్‌కౌంటర్లు చేయించింది గత కాంగ్రెస్ ప్రభుత్వమే
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల జరిగిన కాంగ్రెస్ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఇందిర ఎలాంటి సభ్యత లేకుండా మతిభ్రమించినట్లు తనపై వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. ఈనెల 20న మండలంలోని ఛాగల్లు శివారులో శివారెడ్డిపల్లి వద్ద నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభకు సంబంధించిన ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు చేయలేదని, తనపై చిన్న పిటీ కేసు కూడా లేదన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లిన రేవంత్ రెడ్డికి నన్ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఇందిరపై అనేక చీటింగ్ కేసులున్నాయన్నారు.

ఎన్‌కౌంటర్లు చేయించి నక్సలైట్లను పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్

నేను ఎన్‌కౌంటర్లు చేయించానని అవగాహన లేకుండా ఇందిర నాపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, వాస్తవానికి చర్చల పేరుతో నక్సలైట్లను పిలిచి ఎన్‌కౌంటర్లు చేయించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, ఆసమయంలోనే చర్చలకు పిలిచి వారి స్థావరాలను తెలుసుకుని ఎన్‌కౌంటర్లు చేయించారన్నారు.

లక్ష మందితో సీఎం సభ

సీఎం కేసీఆర్ సభకు గ్రామగ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, లక్ష మందితో సభను నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, ఎంపీపీ కందుల రేఖ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీలోకి ఎప్పుడు వచ్చారనేది కాదని, నిబద్ధతతో పార్టీ కోసం పనిచేసేవారికి ఎప్పటికైనా సముచితస్థానం కల్పిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా మాదాసు వెంకటేష్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కడియం శ్రీహరి సమక్షంలో దాదాపు 500 మంది బీఆర్ఎస్‌లో చేరారు.



శ్రీహరికి గజమాలతో స్వాగతం పలుకుతున్న సర్పంచ్ రాజ్‌కుమార్

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

జఫర్‌గఢ్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని షాపల్లి, అవుసులతండాల్లో శ్రీహరి గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు కడియం శ్రీహరికి ఘన స్వాగతం పలికారు. షాపల్లిలో సర్పంచ్ మండల ఆండాలు యాదగిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: కడియం శ్రీహరికి మద్దతు తెలుపుతున్న షాపల్లి గ్రామస్తులు

శ్రీహరికి మద్దతు తెలిపిన షాపల్లి గ్రామస్తులు, ముదిరాజ్ కులస్తులు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికే తమ పూర్తి మద్దతు అంటూ షాపల్లి గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఇదే విషయాన్ని ఎన్నికల ప్రచారానికి వచ్చిన శ్రీహరి గ్రామస్తులు తెలియజేశారు. అలాగే మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు మద్దతు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

చిల్పూరు: రాజకీయ జన్మనిచ్చిన నియోజకవర్గం అభివృద్ధే తన ధ్యేయమని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం చిల్పూరు, చిన్నపెండ్యాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మీరు ఊహించని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కాగా చిల్పూరులో సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కడియంకు గజమాలతో ఘనస్వాగతం పలికారు.

లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యం

రఘునాథపల్లి: స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి కడియం కారు గుర్తుకు ఓటేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అవినీతి తప్ప.. అభివృద్ధి శూన్యం



వల్లంపట్లలో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న కొమ్మూరి



కూటిగల్‌లో కురుమ కులస్తులు బహూకరించిన గొర్రెపిల్లతో కొమ్మూరి

- ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి తప్ప.. రాష్ట్రం ఏ రంగంలోనూ అభివృద్ధి సాధించలేదని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం దూళ్మిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండా, కూటిగల్, మద్దూరు మండలంలోని వల్లంపట్లలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు మాత్రమే పదవులు అనుభవిస్తున్నారని మండిపడ్డారు. తన హయాంలోనే ఈప్రాంతానికి 86 వేల ఎకరాలకు గోదావరి నీటిని అందించామన్నారు. కాల్వల నిర్మాణ పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించి ఉద్యమద్రోహులను తన వెంట ఉంచుకున్నారని విమర్శించారు. స్థానికేతరుడైన ముత్తిరెడ్డి నియోజకవర్గాన్ని దోచుకున్నాడన్నారు. 8 ఏళ్లు ఎమ్మెల్సీగా ఉన్న పల్లా ఈప్రాంతానికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. అలాంటి వ్యక్తి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. తపాస్‌పల్లి నుంచి సిద్దిపేటకు నీటిని దొంగతనంగా తీసుకెళ్తున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీరు వెళ్లకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. దూళ్మిట్ట మండలంలో ఏ గ్రామంలో ఎక్కువగా ఓట్లు వస్తాయో ఆ గ్రామానికి మొదటి నెల జీతంతో పాటు ఎక్కువ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు కూటిగల్‌లో సమ్మక్క–సారలమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు చెట్కూరి కమాలకర్ యాదవ్, సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మేక మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

జనగామ: పట్టణంలోని 24వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపునకు నెహ్రూ పార్క్, కుర్మవాడ, శివాలయం ఏరియా, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగర బోయిన మల్లేశం, జాయ మల్లేశం, బూడిద చిన్నా గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. 5వార్డు బాణాపురంలో మహిళా కాంగ్రెస్ అధ్వర్యంలో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ బడికె ఇందిర, కాముని జయ, సక్కుబాయి, సుజాత తదితరులతో కలిసి కొమ్మూరి కోడలు దివ్యారెడ్డి ప్రచారం చేపట్టారు.



జనగామలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దివ్య

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

బచ్చన్నపేట: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొని బాలకిషన్‌గౌడ్, మహాత్మాచారి, శ్రీనివాస్, అయిలయ్య, బాలమణి, వేణువందన, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యమ ద్రోహి రేవంత్

జెడ్పీ చైర్మన్, జీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి

జనగామ: ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాటానికి ద్రోహం చేసిన రేవంత్‌రెడ్డి టీపీసీసీ పదవి రాగానే సిపాయిలా మాట్లాడుతున్నాడని జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో టీడీపీకి తొత్తుగా ఉండి, తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని కించ పరిచిన రేవంత్‌ను ఎంత లోతు బొంద పెట్టాలో చెప్పాలన్నారు. నాయకులు పి.జమున, బాల్దె సిద్ధిలింగం, డాక్టర్ సీహెచ్ రాజమౌళి, బైరగోని యాదగిరి గౌడ్, ఆకుల సతీశ్ కుమార్, మేకల కళింగరాజు, సేవెల్లి సంపత్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బక్క నాగరాజు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి బీసీల పట్ల అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని, లక్ష్మయ్యను తిట్టడానికే సభ నిర్వహించినట్టుగా ఉందని పేర్కొన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్న కొమ్మూరి తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న పాగాల సంపత్‌రెడ్డి

జనగామ గడ్డపై కాషాయ జెండా ఎగరేద్దాం

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి



తరిగొప్పుల: జనగామ గడ్డపై కాషాయ జెండా ఎగరవేద్దామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొత్తతండా, మాన్‌సింగ్‌తండా, వెంకట్‌తండా, అంకుషాపూర్, వెంకట్‌తండా గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అంతకు ముందు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. తనను ఆశీర్వదించి ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులకు భూకబ్జాలు, దందాలు తప్ప మరో ధ్యాస లేదని ఆరోపించారు.ఇక్కడ రెండు పర్యాయాలు గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి స్థానికేతరుడైన పల్లా రాజేశ్వర్ రెడ్డి వస్తున్నాడని, ఎమ్మెల్సీగా ఉండి ఏమి అభివృద్ధి పనులు చేశాడని ప్రశ్నించాడు. జిల్లా బాధ్యులు బేజాడి బీరప్ప. అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, మహిపాల్, బానోతు రాంకోటి పాల్గొన్నారు.

'మంత్రి దయాకర్‌రావును విమర్శిస్తే సహించబోం'

పాలకుర్తి: మంత్రి దయాకర్‌రావును కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని గొల్ల, కురుమ సంఘం నాయకులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో సంఘం నాయకులు చిలువేరి పెంటయ్య, కత్తుల యాకయ్య, సలేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకుర్తిలో గొల్ల, కుర్మల ఆత్మీయ సభను విజయవంతంగా నిర్వహించారని అన్నారు. నియోజకవర్గంలోని గొల్ల, కుర్మలంతా మంత్రి దయాకర్‌రావు వెంటే ఉన్నారని తెలిపారు. ఆత్మీయ సభను చూసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు భయం పట్టుకుని, డబ్బులు ఇచ్చి తీసుకువచ్చారని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లి యుగేందర్, శీల లింగయ్య, రమేష్, అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం ధాన్యం పోటెత్తింది. ఉదయం 9 గంటల లోపే వివిధ గ్రామాల నుంచి మార్కెట్‌కు సరుకు చేరుకుంది. ఆ తర్వాత వచ్చిన వాహనాలను గేటు వెలుపలనే ఆపేశారు. 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వ్యాపారులకు బిడ్డింగ్ ఇచ్చారు. 214 రైతుల వద్ద 7,447 (11,457 బస్తాలు) క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుచేశారు. క్వింటా గరిష్ట ధర రూ.1,969, కనిష్టం రూ.1,656, మోడల్ ప్రైజ్ రూ.1,929 ధర పలికింది. మార్కెట్‌కు ఆలస్యంగా వచ్చిన సరుకును నేడు(శుక్రవారం) విక్రయాలు జరుపుతామని అధికారులు వ్యాపారస్తులకు తెలిపారు.



మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

బిల్లు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ నిరసన

చిల్పూరు: పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పనులు చేపట్టాలని ఒత్తిడి తెచ్చి తీరా పూర్తి చేశాక బిల్లు ఇవ్వకుండా సంబంధిత అధికారులు ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టర్ గొంగిడి కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నిరసన చేపట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఎన్ఆర్ఈజీఎస్ కింద నాలుగు గదుల నిర్మాణానికి రూ.14 లక్షల వ్యయంతో పనులు మంజూరయ్యాయి. ఆ పనులను మొదట ఎస్ఎంసీ చైర్మన్ బాలకృష్ణ చేపట్టి.. కొంత మేరకు అయ్యాక నిధులు లేక పనులు ఆపడంతో ఉప సర్పంచ్ భర్త కృష్ణమూర్తికి అప్పగించారు. 'త్వరలోనే నిధులు మంజూరు చేస్తామనడంతో అందిన కాడ రూ.8 లక్షల వరకు అప్పు తెచ్చి 80 శాతం పనులు పూర్తి చేశాను.. ఇప్పటి వరకు బిల్లు రాలేదు.. అప్పు ఇచ్చిన వారు ఇబ్బంది పెడుతున్నారు.. ఏఈ, ఏడీ చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు'.. అంటూ కృష్ణమూర్తి వాపోయాడు. ఇప్పటికైనా బిల్లు మంజూరు చేయాలని కోరుతున్నాడు.



నేడు నాగుల చవితి

జనగామ: కార్తీక మాస పర్వదినం పురస్కరించుకుని నేడు(శుక్రవారం) జిల్లా వ్యాప్తంగా ప్రజలు నాగుల చవితి పండగను జరుపుకోనున్నారు. శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసంలో వచ్చే నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేస్తారు. పట్టణంలోని పోచమ్మ, గీతాశ్రమంతో పాటు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బచ్చన్నపేట: ఆలింపూర్ గ్రామానికి చెందిన గుండని జంపయ్య విద్యుదాఘాతంతో గాయాల పాలు కాగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థికసాయం అందించినట్లు సర్పంచ్ బాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జంపయ్య గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, సర్పంచ్ వినతి మేరకు పల్లా స్పందించి ఆర్థికసాయాన్ని అందించారని పేర్కొన్నారు. మెరుగైన వైద్యం కోసం పల్లా హామీ ఇచ్చారని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.